

మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను బుధవారం మేడ్చల్‌లోని ఆయన నివాసంలో బీజేపీ జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన విషయాలను ఆయన ఈటలతో చర్చించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీజేపీకి అత్యధిక మెజారిటీ వస్తుందని తెలిపారు. - హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడిగా జగన్‌యాదవ్



మధుయాష్కీగౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న జగన్

చాదర్‌ఘాట్, మే 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడిగా ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకుడు గండి జగన్‌యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయన నియామక పత్రాన్ని కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి చైతన్యం చేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తానని జగన్‌యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు.



పెద్దచెరువులో చెత్తను తొలగిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

ప్రజా సంక్షేమమే ధ్యేయం: కార్పొరేటర్ కొప్పుల

వనస్థలిపురం, మే 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి మన్సూరాబాద్‌లో జరుగనున్న బీరప్పస్వామి పండుగకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెద్దచెరువులో ఉన్న చెత్త, వ్యర్థ పదార్థాలను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తన సొంత నిధులతో తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కురుమ సోదరులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుపుకునే బీరప్పస్వామి పండగ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన సొంత నిధులతో పెద్దచెరువును సుందరీకరణ చేశామన్నారు. చెరువులోని పలు వ్యర్థాలను తొలగించి, గంగాస్నానాల కోసం కొలనులో పరిశుభ్రమైన నీరును నింపడం జరిగిందన్నారు. ప్రజాసంక్షేమమే తన ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని కార్పొరేటర్ పేర్కొన్నారు.



నర్సులకు సర్వేకల్ క్యాన్సర్ ప్రివెన్షన్ ఫ్రీ వ్యాక్సిన్‌ను అందజేస్తున్న బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవేన్

నర్సుల సేవలు ఎనలేనివి

- బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవేన్

ఎల్బీనగర్, మే 15(ఆంధ్రజ్యోతి): నర్సుల సేవలు ఎనలేనివని బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవేన్, ఓజోన్ ఆస్పత్రి చైర్మన్ బీవీ సత్యసాయిప్రసాద్ అన్నారు. ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా బుధవారం ఆర్కేపురంలోని ఓజోన్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ వైన్ ఓవేన్ ముఖ్యఅతిథిగా హాజరై నర్సులకు సర్వేకల్ క్యాన్సర్ ప్రివెన్షన్ ఫ్రీ వ్యాక్సిన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సులు ఆరోగ్యంగా ఉంటేనే అందరికీ వైద్య సేవలు అందించగలుగుతారన్నారు. 30 సంవత్సరాల పైబడిన వారికి గర్భాశయం ముఖద్వారానికి సంబంధించిన సమస్యలు వస్తాయన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే సమస్యలు రాకుండా అరికట్టవచ్చన్నారు. గర్భాశయ క్యాన్సర్‌పై అందరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి, డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ పూజిత, డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావులతో పాటు నర్సులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

18న వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి జయంతి వేడుకలు



బచ్చు మహేష్‌గుప్తా

చంపాపేట, మే 15(ఆంధ్రజ్యోతి): చంపాపేట ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఈనెల 18న ఉదయం సంఘం భవనంలో వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్‌గుప్తా తెలిపారు. చంపాపేటలో బుధవారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం హోమం, పారాయణ కార్యక్రమం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6గంటలకు ఆర్యవైశ్య భవనం నుంచి చంపాపేట గాంధీ విగ్రహం వరకు రథంపై అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమ్మవారి జయంతి వేడుకలకు డివిజన్‌లోని ఆర్యవైశ్యులందరు కుటుంబ సభ్యులతో కలిసి హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని మహేష్‌గుప్తా అన్నారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరే రవీందర్‌గుప్తా, అమావాస్య అన్నదాన కమిటీ చైర్మన్ విజయ్‌నాథ్‌గుప్తా, ఊరే మధుసూదన్‌గుప్తా, ఊరే రవీందర్‌గుప్తా పాల్గొన్నారు.

18 నుంచి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

వనస్థలిపురం, మే 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 18నుంచి జూన్ 1వరకు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని గణేష్ ఆలయంలో ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.ధర్మారావుగుప్తా, ప్రధాన కార్యదర్శి పీ.వీ.కే సోమయాజులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వారు మాట్లాడుతూ ఈనెల 31 నుంచి జూన్ 5వరకు నిర్వహించే ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని హనుమాన్ సామూహిక చాలీసా పారాయణం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఆలయ ప్రధాన కార్యదర్శి 9390197132ను సంప్రదించాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట, మే 15(ఆంధ్రజ్యోతి): చంపాపేట సాయిరాంనగర్ కాలనీలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ పద్మానగర్‌కాలనీ, అంజిరెడ్డికాలనీ ఫీడర్లలో వివిధ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8గంటల నుంచి అరగంట పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్ తెలిపారు. దీంతో సాయిరాంనగర్‌కాలనీ, అంజిరెడ్డినగర్, పద్మానగర్, పవన్‌పురికాలనీ, ఉదయ్‌నగర్‌కాలనీ, ప్రెస్‌కాలనీ, విష్ణుపురికాలనీ, ఎంఆర్‌ఆర్‌కాలనీ, కర్మన్‌ఘాట్ మెయిన్‌రోడ్, న్యూపద్మానగర్, క్రాంతినగర్, రాఘవేంద్రనగర్, నిర్మలానగర్, శ్రీనిధికాలనీ, జ్యోతినగర్, కర్మన్‌ఘాట్ విలేజ్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

ఈదుల చెరువు కబ్జాపై కదలిన ఇరిగేషన్ యంత్రాంగం

- ఎఫ్‌టీఎల్‌లోని పిల్లర్లు, బేస్‌మెంట్‌లు కూల్చివేత
- కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు
- చెరువు, కుంటల కబ్జాకు పాల్పడితే క్రిమినల్ కేసులు : అధికారుల హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అబ్దుల్లాపూర్‌మెట్, మే 15(ఆంధ్రజ్యోతి): చెరువు కబ్జాలపై ఇరిగేషన్ యంత్రాంగం కదిలింది. పెద్దఅంబర్‌పేట్‌లో ఈదుల చెరువు కబ్జాకు గురవుతోంది. వారం పది రోజులుగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని మట్టితో పూడ్చివేస్తున్నారు. రాత్రికి రాత్రే ప్రహరీ నిర్మాణ పనులు చేస్తున్నారని 'ఈదుల చెరువు ఎఫ్‌టీఎల్ కబ్జా' అనే శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఇబ్రహీంపట్నం డివిజన్ ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి, ఏఈ తస్వీన్‌రజాతో పాటు పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి బుధవారం ఈదుల చెరువు కబ్జా ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మిస్తున్న పిల్లర్లను, బేస్‌మెంట్‌లను జేసీబీతో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఏఈ తస్వీన్‌రజా మాట్లాడుతూ ఎఫ్‌టీఎల్‌లో పోసిన మట్టిని తొలగించేందుకు రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు లెటర్ రాసినట్లు తెలిపారు. మట్టిపోసి కబ్జాకు పాల్పడుతున్న వారిపై పోలీస్‌స్టేషన్‌లో కేసుపెట్టినట్లు చెప్పారు. సర్వే చేసిన అనంతరం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను ఏర్పాటు చేస్తామన్నారు. చెరువు, కుంటల కబ్జాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన బేస్‌మెంట్‌ను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తున్న దృశ్యం



చెరువు ఎఫ్‌టీఎల్‌లో ప్రహరీ కోసం వేసిన పిల్లర్లను జేసీబీతో కూల్చివేయిస్తున్న ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి తదితరులు

గంజాయి నిర్మూలనపై దృష్టి పెట్టాలి

- మాజీ మంత్రి సబితారెడ్డి సమీక్ష నిర్వహించాలి
- పోలీసులు నిరంతరం నిఘా కొనసాగించాలి
- బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ డిమాండ్

సరూర్‌నగర్, మే 15(ఆంధ్రజ్యోతి): సమాజంలో గంజాయి నిత్యావసర సరకులా లభించే దుస్థితి ఏర్పడిందని, దీనికి అధికారంలో ఉన్న ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణే కారణమని బడంగ్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ విమర్శించారు. ప్రతి ఒక్కరూ గంజాయి నిర్మూలనను తమ బాధ్యతగా భావించి, ఆ దిశలో తమ వంతు ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఆయన అన్నారు. బుధవారం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గంజాయి నిర్మూలనపై ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమయ్యాయని, పోలీసులు సైతం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవ చూపాలి



ఇబ్రాం శేఖర్, డిప్యూటీ మేయర్

బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, దానికి బానిసలై అనేక మంది పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలు అనారోగ్యంపాలై చావుకు దగ్గరవుతున్నారని శేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ఉన్న మాజీ మంత్రి సబితారెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టి సారించి స్థానిక ప్రజాప్రతినిధులను, పోలీస్ అధికారులను, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసి గంజాయి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్పొరేషన్ మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు కలిసివస్తే తాను గంజాయి నిర్మూలనా కార్యక్రమాలను ముందుండి నడిపిస్తానని ఆయన పేర్కొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యంగానే తమ శిశువు మృతి చెందిందని బాధితుల ఆందోళన
- సర్దిచెప్పి పంపించిన వైద్యులు

వనస్థలిపురం, మే 15(ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులతో ఆస్పత్రికి వచ్చిన గర్భిణికి జన్మించిన పండంటి మగబిడ్డ వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన సంఘటన వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యపేటకు చెందిన శిరీష నెలలు నిండడంతో మంగళవారం రాత్రి వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో చేరారు. దీంతో మంగళవారం అర్థరాత్రి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఆస్పత్రిలో ఉన్న వైద్యురాలు మాధవీలత శిరీషకు ఆపరేషన్ చేసి మగ బిడ్డకు జన్మనిచ్చారు. కాగా శస్త్రచికిత్స సమయంలో శిశువు బొడ్డు తాడు బయటనే ఉంచడంతో ఆ శిశువు మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ మృతిచెందిందని కాసేపు ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఆందోళన చేస్తున్న వారిని ఆస్పత్రి వైద్యులు సర్దిచెప్పడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు.

మసకబారుతున్న వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి పేరుప్రఖ్యాతలు

గ్రేటర్ హైదరాబాద్‌లోనే ఎంతో పేరుగాంచిన వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి పేరు ప్రఖ్యాతలు రోజురోజుకు మసకబారుతుందని అనడంలో అతిశయోక్తి లేదు. రంగారెడ్డి, నల్లగొండ ఇతర జిల్లాల నుంచి నిత్యం వెయ్యికి పైగా గర్భిణులు, రోగులు వస్తుంటారు. కొంత కాలంగా ఇక్కడికి వచ్చే రోగుల పట్ల ఆస్పత్రిలోని కొంతమంది వైద్యులు, ఇతర సిబ్బంది నిర్లక్ష్యం, చేతివాటం, దురుసు ప్రవర్తనతో ఆస్పత్రికి చెడ్డపేరు తీసుకవస్తున్నారని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మక చర్యలు చేపడతున్నప్పటికీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది మూలంగా వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి రోగులు, గర్భిణులు రావాలంటేనే జంకుతున్నారు. పేరుకు ప్రభుత్వ ఆస్పత్రి అయినప్పటికీ డాక్టర్లకు, ఇక్కడ పనిచేసే సిబ్బందికి ముడుపులు ఇవ్వందే ఏ పనికాదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిపై ప్రత్యేక శ్రద్ధ వహించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.

కోడ్ వేళ.. కౌన్సిల్ సమావేశం

- రద్దు చేయాలని బీఆర్ఎస్ కార్పొరేటర్ల డిమాండ్
- రద్దు చేస్తున్నట్లు కమిషనర్ ప్రకటన.. వెంటనే సమావేశం సాఫీగా సాగిందని వాట్సప్ మెసేజ్
- వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళన



ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

నిజాంపేట్, మే 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో నిజాంపేట్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించడం ఏమిటని బీఆర్ఎస్ కార్పొరేటర్లు బుధవారం నిరసన తెలిపారు. వారి నిరసన మేరకు కౌన్సిల్ సమావేశాన్ని రద్దు చేస్తున్నట్టు మేయర్ నీలారెడ్డి, కమిషనర్ రామకృష్ణలు సభ్యుల సమక్షంలో ప్రకటించారు. ఆ తరువాత కొద్ది సేపటికే సమావేశం సాఫీగా సాగిందని వాట్సప్ సమాచారం పంపారు. దీనిని నిరశిస్తూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు బాలాజీనాయక్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎన్నికల సందర్భంగా అయిన ఖర్చులను తీర్మానం చేయడానికి సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో బీఆర్ఎస్ కార్పొరేటర్ సమావేశాన్ని రద్దు చేయాలని ఆందోళన చేశారు. దీంతో మేయర్, కమిషనర్ కలుగచేసుకొని సమావేశాన్ని రద్దు చేస్తున్నామని ప్రకటించారు. అదే సమయంలో సమావేశం పూర్తయిందని కార్పొరేటర్ల వాట్సప్ గ్రూప్‌ల్లో మేసేజ్ రావడంతో వారు కంగుతిన్నారు. దీంతో మేయర్ నీలారెడ్డి, కమిషనర్ రామకృష్ణల తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కోడ్ ముగిసిన తరు వాత వచ్చే నెలలోనే సమావేశాన్ని నిర్వహించాలని, ఇష్టానుసారంగా సమావేశం నిర్వహించడం ఏమిటని కమిషనర్ తీరుపై కార్పొరేటర్ బాలాజీనాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌తో 12 మంది కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మరణంలోనూ మానవత్వం



లక్ష్మీదేవమ్మ (ఫైల్)

సనత్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్ అయిన మహిళ నుంచి జీవన్‌దాన్ సభ్యులు అవయవాలు సేకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన మేకల లక్ష్మీదేవమ్మకు(42) భర్త రాములు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈనెల 5న కుమారుడితోపాటు లక్ష్మీదేవమ్మ బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. లక్ష్మీదేవమ్మకు తలకు తీవ్రమైనగాయాలు కావడంతో పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు తొమ్మిదిరోజుల పాటు చికిత్స అందించినా స్పందించకపోవడంతో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. జీవన్‌దాన్ సభ్యులు లక్ష్మీదేవమ్మ కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించి ఆమె నుంచి లివర్, 2 కిడ్నీలు, 2 కార్నియాలు సేకరించారు.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- ముఖ్యమంత్రికి ఆర్. కృష్ణయ్య లేఖ

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): బీసీల కులగణన చేసి పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బుధవారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రికి రాసిన లేఖలోని వివరాలను వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు 22 శాతం నుంచి 42 శాతంకు పెంచుతామని ప్రకటించిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



ఘటనా స్థలంలో మృతుడు తేజా

అబ్దుల్లాపూర్‌మెట్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నల్గొండ జిల్లా, చింతపల్లి మండలంలోని సాయిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గండేటి తేజా(50) భార్య సంతోష, ముగ్గురు పిల్లలతో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామంలోని ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్నారు. అతడు గీత కార్మికుడి వృత్తి కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా బుధవారం ఉదయం 6.30 గంటలకు బాలసింగారం పరిధిలోని దొడ్డ శాంతికుమార్ వ్యవసాయ భూమిలో తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. కల్లు, ముంజలు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కిందపడ్డాడు. దాంతో అతడి తల, మెడ, కుడి తొడపై తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సంతోష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, మే 15(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించి హతమార్చిన భర్తకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తు అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వై. జయప్రసాద్ బుధవారం తీర్పు చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వొద్యారపు రవికుమార్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం మల్లయ్యగూడెంకు చెందిన బెక్కా సందీప్ వివాహం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గొల్తాండకు చెందిన రాణితో జరిగింది. వివాహం అనంతరం కొంత కాలం వారి సంసారం సంతోషంగా సాగింది. తర్వాత సందీప్ రాణిని అదనపు కట్నం కోసం వేధించసాగాడు. దీంతో రాణి తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో నచ్చచెప్పారు. సందీప్ రాణీలు తమ సంసారాన్ని సాహెబ్‌నగర్‌కు మార్చారు. వారికి ఇద్దరు సంతానం కలిగారు. అయినప్పటికీ సందీప్‌లో మార్పు రాలేదు. 2018 ఫిబ్రవరి 28న రాత్రి సందీప్ రాణితో గొడవ పడి రోకలిబండతో తలపై బాదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాణి తల్లి అజ్మీరా మస్రు కూతురి ఇంటికి వచ్చింది. రక్తం మడుగులో పడి ఉన్న రాణి మృతదేహాన్ని చూసి బోరున విలపిస్తు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి జయప్రసాద్ నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ. 3 వేల జరిమానా విధిస్తు తీర్పు ఇచ్చారు.

బీఆర్ఎస్ నాయకుడిపై దాడిచేసిన వారిపై కేసు

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డిపై దాడి చేసిన మాజీ కార్పొరేటర్ కుమారులపై కేసు నమోదైంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం సెయింట్ పాయిస్ స్కూల్ వద్దకు కొండా శ్రీధర్‌రెడ్డిని రమ్మని మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మి, ఎడ్ల హరిబాబుయాదవ్ దంపతుల కుమారులు అభినయ్ యాదవ్, వరుణ్‌యాదవ్, సాయియాదవ్ పిలిచారు. శ్రీధర్‌రెడ్డి వెళ్లగానే వారితో పాటు మరికొంతమంది ఆయనపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అభినయ్ యాదవ్, వరుణ్ యాదవ్, సాయియాదవ్‌తోపాటు మరి కొందరిపై పలు సెక్షన్‌ల కింద బుధవారం కేసు నమోదు చేశారు.

కులం పేరుతో దూషించిన బీఆర్ఎస్ నాయకుడిపై ఫిర్యాదు

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కులం పేరుతో దూషించిన బీఆర్ఎస్ నాయకుడిపై బీజేపీ నాయకుడు ముషీరాబాద్ పీఎస్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత 5.30 గంటల సమయంలో భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లో ఉంటున్న బీజేపీ నాయకుడు గోకారం లక్ష్మణ్ ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో హరిహరకళాక్షేత్రం వద్ద బీఆర్ఎస్ నాయకుడు సతీష్ లక్ష్మణ్‌ను పిలిచి కులం పేరుతో అకారణంగా దుర్భాషలాడాడు. బాధితుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు.

నంబర్ ప్లేట్లు లేని వాహనదారులపై కేసు

చిక్కడపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై తిరుగుతున్న వారిని పోలీసులు పట్టుకుని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నత్తనడకన ఓఆర్ఆర్ ఫేజ్-2 పనులు

- రియల్టర్లతో కుమ్మక్కు
- అక్రమ లేఅవుట్లలో పైపులైన్లు

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు వాటర్‌బోర్డు చేపట్టిన ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యాలకు భిన్నంగా, వాటర్‌బోర్డు నిర్ణయాలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారు. రియల్టర్లతో కుమ్మక్కై, శివారు ప్రాంతాల్లోని అక్రమ లేఅవుట్లలో కూడా పైపులైన్లు వేస్తున్నారు. గత ప్రభుత్వం ఔటర్ పరిధిలోని ప్రాంతాలకు తాగునీటిని అందించే బాధ్యతలను వాటర్‌బోర్డుకు అప్పగించింది. ఓఆర్ఆర్ ఫేజ్-1 ప్రాజెక్టులో భాగంగా రూ.756 కోట్లతో కొంతమేరకు పనులు పూర్తయ్యాయి. ఓఆర్ఆర్ ఫేజ్-2లో భాగంగా రూ.1200 కోట్లతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటి అందించే పనులను 2022లో ప్రారంభించారు. ఇందులో భాగంగా కొత్తగా 73 సర్వీసు రిజర్వాయర్లు (138 మిలియన్ లీటర్ల సామర్థ్యం), 2988 కిలోమీటర్ల మేర నూతన పైపులైన్ నిర్మించాల్సి ఉంటుంది. ప్యాకేజ్-1లో రూ.613.14 కోట్లతో 1571 కిలోమీటర్ల మేర కొత్తగా పైపులైన్ వేయడంతో పాటు 65.5 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన 34 రిజర్వాయర్ల నిర్మాణం చేయాలని, ప్యాకేజ్-2లో రూ.586.86 కోట్లతో 1094 కిలోమీటర్ల మేర పైపులైన్ విస్తరణ, 36 రిజర్వాయర్లు నిర్మించాలని నిర్ణయించారు. గతేడాది డిసెంబర్ వరకు పనులు పూర్తిచేయాలని లక్ష్యాన్ని నిర్ణయించగా ఆరు నెలలు గడుస్తున్నా కనీసం 70 శాతం కూడా పూర్తవలేదు. పూర్తిస్థాయిలో సర్వీసు రిజర్వాయర్లు అందుబాటులోకి రాలేదు. ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో అధికారులు సైతం స్పష్టతనివ్వడం లేదు. ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టులో 73 రిజర్వాయర్లకు 35 మాత్రమే పూర్తిస్థాయిలో నిర్మాణం చేసినట్లు తెలిసింది. మిగతా 38 రిజర్వాయర్ల పనులు సాగుతున్నాయి. 90 శాతం పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నా ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు. మొత్తం 2988 కిలోమీటర్ల పైపులైన్‌కు గానూ 2032 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయింది. 956 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. తాగునీటి సరఫరా పనులను సత్వరమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన ఇంజనీరింగ్ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. పనులు పూర్తి చేయడానికి నిర్మాణ ఏజెన్సీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ లేఅవుట్లలో పైపులైన్లు

ఓఆర్ఆర్ ఫేజ్-2లో భాగంగా శివారులోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలు, 24 గ్రామ పంచాయతీల్లో 2988 కిలోమీటర్ల పైపులైన్ వేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 2150 కిలోమీటర్ల మేర పైపులైన్ మాత్రమే పూర్తి చేశారు. ఇంకా 800కు పైగా కిలోమీటర్ల పైపులైన్ వేయాల్సి ఉంది. ఇప్పటివరకు నిర్మాణం జరిగిన పైపులైన్ పనుల్లో భారీగా డొల్లతనం ఉన్నట్లు తెలిసింది. నివాసాలు కలిగిన ప్రాంతాల్లోనే పైపులైన్లు వేసి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అందుకు భిన్నంగా ప్రాజెక్టు విభాగంలోని కొందరు అధికారులు, ఏజెన్సీలు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు సమాచారం. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేట్ లేఅవుట్‌లో ఇళ్లు లేకపోయినా పైపులైన్లు వేసినట్లు తెలిసింది. తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ ప్రాంతంలో లేఅవుట్ యజమానులకు మేలు చేసేలా పైపులైన్లు వేశారు. ఘట్‌కేసర్, కీసర, పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాల పరిధిలోని పలు ప్రాంతాల్లో రియల్టర్లతో కొందరు అధికారులు కుమ్మక్కై, ఇష్టానుసారంగా పైపులైన్లు వేసినట్లు తెలిసింది. ఇటీవల ఏసీబీకి చిక్కకుండా తృటిలో తప్పించుకున్న వాటర్‌బోర్డులోని ఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్టు సమాచారం. వాటర్‌బోర్డు ఎండీ మారడం, కొత్తగా మరో ఎండీ రావడంతో ఇదే అదనుగా భావించి ఎన్నికల సమయంలోనే ఈ తతంగాన్ని సాగించినట్టు తెలిసింది. కొత్తగా వచ్చిన ఎండీ ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టును పరిశీలన చేసే లోపు అక్రమాలు జరిగినట్టు బోర్డులో గుసగుసలు వినిపిస్తున్నాయి.



శివారులోని ఓ ప్రాంతంలో నిలిచిన పైపులైన్ పనులు